క్లుప్తంగా

క్రీడా వేదికకు శంకుస్థాపన



పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను అభివృద్ధి చేసేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రీడా వేదిక నిర్మాణానికి దాత ఆర్తిమళ్ళ రమేష్ చేతుల మీదగా ఆదివారం శంకుస్థాపన చేశారు. దాత ఆర్తిమళ్ల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన సతీమణి మాజీ సర్పంచ్ ఆర్తిమళ్ల నళిని పేరుతో ఈ వేదిక నిర్మిస్తున్నామన్నారు. ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయ స్వామి వార్షికోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని సంఘం బజారులోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో 18వ వార్షిక వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, ఆకు పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాబీ మెమోరియల్ క్రికెట్ లీగ్-2025 పోటీలు ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాబీ మెమోరియల్ క్రికెట్ లీగ్-2025 సీజన్ 4 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను టీడీపీ నాయకుడు మన్నెం శివ నాగ మల్లేశ్వరరావు, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డాక్టర్ వడ్డేంపూడి పవన్‌కుమార్‌లు ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడలో ప్రతిభను చాటాలన్నారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పూజల వెంకట కోటయ్య, మార్కెట్ రాజు, కొత్త రామకృష్ణ, సుబ్బయ్య, తోట అంబికా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నప్పరెడ్డికి నివాళులు



క్రోసూరు: అచ్చంపేట మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కీర్తిశేషులు తుమ్మా చిన్నప్పరెడ్డి సంతాప సభ ఆదివారం అచ్చంపేట వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్, నాయకులు నెల్లూరి చంద్రాబాబు, గంగసాని బాబు, కంబాల వీరబాబు, జానీ, కార్యకర్తలు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ చినప్పరెడ్డి సేవలు మరవలేనివని కొనియాడారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన అన్నదమ్ముల మధ్య నెలకొన్న వివాదం ముదిరి జరిగిన ఘర్షణలో తమ్ముడి తలకు గాయమైన ఘటన ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్టీ కాలనీకి చెందిన మేడ బ్రహ్మయ్య, అతని తమ్ముడు మేడ గణపతిలు పరదా పట్టాలు వ్యాపారం చేస్తుంటారు. వీరిరువురి మధ్య పరదా పట్టాల విషయంలో వివాదం ముదిరి ఘర్షణకు దారి తీసింది. చిన్నవాడైన గణపతిని అన్న బ్రహ్మయ్య కర్రతో తలపై కొట్టడంతో గాయమైంది. గాయపడిన గణపతిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన ఘటనపై గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

మలుపు ఉన్నది.. జాగ్రత్త..!

- అదుపుతప్పితే మరణమే
- రోడ్డు దాటే క్రమంలో అనేక ప్రమాదాలు
- మలుపులను తగ్గించాలని కోరుతున్న స్థానికులు
- వరుస ఘటనలతో వాహనదారుల బెంబేలు





పెదనెమలిపురి గ్రామం మధ్యలో రహదారికి వెంట వెంటనే ఉన్న మలుపులు

రాజుపాలెం: వేగంగాను, సులభంగాను గమ్యానికి చేరుకునేందుకు నిర్మించిన రాష్ట్ర రహదారి కొన్ని ప్రాంతాలకు మృత్యు మార్గంగా మారింది. రెప్పపాటులో చూస్తూ ఉండగానే పలువురు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. మరో వైపు రోడ్డు క్రాసింగ్‌కు సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రమాదమని తెలిసినా ప్రజలు దూరాన్ని అధిగమించేందుకు ఈ రహదారిపై డివైడర్లు దాటుకుని క్రాస్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి మండలంలోని పెదనెమలిపురి గ్రామం మధ్యగా వెళ్లడంతో వెంట వెంటనే రెండు మలుపులు ఉండడంతో ఆ మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ముందు నుంచే ప్రమాదాలకు నిలయంగా ఉన్న ఈ రహదారి మలుపుల వద్ద నాలుగులైన్‌లగా నిర్మాణం ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

అపరిమిత వేగంతో ప్రమాదాలు

అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై వాహనాలు గరిష్టంగా 60-80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చని రోడ్డు సేఫ్టీ అధికారులు ప్రకటించారు. దీనికి తగ్గట్టుగానే వాహనాలు మరింత వేగంగా వెళుతున్నాయి. ఈ క్రమంలో ఈ రహదారిపై ఉన్న రెండు మలుపుల వద్ద వాహనాలు అదుపు చేయడం డ్రైవర్లకు మరింత కష్టంగా మారింది. దీంతో రోడ్డుకు కుడి, ఎడమ మార్గాల మీద వస్తున్న వాహనాలు ముఖ్యంగా లారీలు, కారులు నడుపుతున్న వారు అదుపుచేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. వారితో పాటు కుటుంబ సభ్యుల ప్రాణాలను ప్రమాదం బారిన పడవేస్తున్నారు. రహదారి అభివృద్ధి తరువాత ఇక్కడ జరిగిన ప్రమాదాలన్నీ ఇలాంటి కోవకు చెందినవే ఎక్కువగా ఉన్నాయి.



ఇటీవల కాలంలో ప్రమాదానికి నుజ్జునుజ్జయిన కారు

ఇటీవల దాదాపు రెండు నెలల కాలంలో జరిగిన వరుస ప్రమాదాలు ఇలా...

1. జిప్సం ట్యాంకర్ ఆటోను ఢీకొనడంతో ఇకరు మృతి చెందగా నలుగురికి గాయాలు
2. నకరికల్లుకు చెందిన ఇరువురు విద్యార్థులు ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపు తప్పి పడడంతో అక్కడికక్కడే మృతి
3. ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడి ఒకరు మృతి
4. లారీ గేదెలను ఢీ కొనడంతో నాలుగు గేదెలు మృతి
5. లారీ క్రాస్ చేసే క్రమంలో ట్రాక్టర్ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి
6. రోడ్డు దాటుతున్న విద్యార్థిని లారీ ఢోకొనడంతో మృతి
7. ఇటీవల కాలంలో జిప్సం ట్యాంకర్ డివైడర్‌ను ఢీకొని కారుపై పడడంతో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులు మృతి

ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగ్

ఒక పక్క ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న గ్రామం మధ్యలో ఉన్న మలుపులకు అతి దగ్గరలోనే గ్రామస్తులు రోడ్డును క్రాస్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు రోడ్డు క్రాస్ చేస్తూ రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డును క్రాస్ చేస్తున్న సమయంలో అతివేగంగా వస్తున్న లారీలకు ఒక్కసారిగా బ్రేక్ వేస్తుండడంతో పలు ప్రమాదాలు జరిగాయి.

అండర్‌పాస్ నిర్మించాలి



గ్రామం మధ్యలో ఉన్న మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రమాదం జరిగిందంటే మరణమే, తీవ్రమైన ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ రహదారి నిర్మాణం తరువాత అనేక ప్రమాదాలు జరిగాయి. మహిళలు, విద్యార్థులు మృత్యువాత పడుతున్న ఘటనలూ ఉన్నాయి. అండర్‌పాస్ నిర్మించాలి. అధికారులు ఇక్కడ ఉన్న మలుపులను తగ్గించాలి.

– మర్రి నరసింహారావు, పెదనెమలిపురి

ప్రమాదాలను నివారించాలి



గ్రామం మధ్యలో రాష్ట్ర రహదారికి వెంట వెంటనే రెండు మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు దాటాలంటే మహిళలు, విద్యార్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. నెలలో 2, 3 ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనాలు అతివేగంతో రావడం వలన మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే అధికారులు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నాం.

– నల్లగొర్ల లక్ష్మీనారాయణ, పెదనెమలిపురి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం



రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తిస్తున్నాం. అలాగే మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. వేగ నియంత్రణ, ఓవర్ లోడ్‌లను అరికట్టేందుకు నిత్యం నిఘా ఏర్పాటు చేశాం. తరచూ వాహనాలను తనిఖీ నిర్వహించి తగిన అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం.

– కె.వేణుగోపాల్, ఎస్ఐ, రాజుపాలెం

అన్ని గ్రామాల్లో పీ 4 సర్వే



క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పీ 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్)సర్వే చేపట్టనున్నట్లు ఎంపీడీవో జి.శ్రీనివాస్ ఆదివారం తెలియజేశారు. ఆయన పీసపాడు గ్రామంలో జరుగుతున్న పీ 4 సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అట్టడుగునున్న పేదలను గుర్తించేందుకు ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితిగతులపై 27 ప్రశ్నలను అడిగి సమాధానాలు నమోదు చేసుకోవటం జరుగుతుందన్నారు. ఈ సమాధానాలను ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఈ సర్వేలో కుటుంబ యజమాని ఆధార్, ఫోను నెంబర్‌తో పాటు ఇంట్లో టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, ఏసీ, ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ ఉన్నాయా, వంటగ్యాస్ ఉందా, కుటుంబ నెలవారి ఖర్చు ఎంత, ఎంత మంది సంపాదిస్తున్నారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుకున్నారా, నెలకు ఎంత కరంటు బిల్లు వస్తుందన్న ప్రశ్నలకు సమాధానాలు రాసుకుంటారని తెలిపారు. ఈ నెల 21 నుండి 23 వరకు గ్రామ సభలు నిర్వహించి వివరాలు వెల్లడిస్తారన్నారు. 24 నుంచి 26 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. 27 నుంచి 29 వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి తుది జాబితా ప్రకటించటం జరుగుతుందన్నారు.

కాలువలకు 31 వరకే సాగు నీరు విడుదల

ముప్పాళ్ళ: నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి మార్చి 31 వరకు మాత్రమే సాగు నీరు విడుదల అవుతుందని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ ఆదివారం చెప్పారు. సాగర్ రిజర్వాయరులో నీటి పరిమాణం దృష్టిలో పెట్టుకొని రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటి విడుదల నిలిపివేతను దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకొని పంటలను కాపాడుకోవాలని అన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు

బెల్లంకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న 'యువత పోరు' ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని చంద్రాజుపాలెంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థులకు రావలసిన బకాయిలను రాకుండా చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యతనిస్తూ, పేద విద్యార్థులకు భరోసా ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని గ్రామాలలో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ నాయకులు మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ దరియా, సర్పంచులు కంభంపాటి పాప, బాణావతు నరసింహ నాయక్, చిమటా వెంకట సైదయ్య, కొడవటి బాబూజీ, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, రేగులగడ్డ శీను, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్లు బొడ్డుపల్లి రాము, మర్రి పెద్ద బ్రహ్మారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గాదెమిల్లు వెంకటరెడ్డి, వేల్పుల కోటేశ్వరరావు, మేకల వెంకటేశ్వర్లు, కొండెబోయిన శ్రీనివాసరాజు, భుక్యా రామకోటి నాయక్, బోనం వెంకట్రామిరెడ్డి, ఆరుద్ర నరసింహారావు, గుడిసె నాగిరెడ్డి, కర్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాతయ్యస్వామి ఆలయ వార్షికోత్సవం



డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డికి మెమెంటో అందిస్తున్న గ్రామస్తులు

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న నంద్యాల ఫకీరప్ప తాతయ్యస్వామి ఆలయ వార్షిక వేడుకలు శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేసి మెమెంటోతో సత్కరించారు. ఆలయ పూజారులు స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబాషా, ఎంపీటీసీ సభ్యుడు రేమిడిచర్ల కాశీ, చందు, రామకృష్ణారెడ్డి, చల్లా శ్రీనివాసరెడ్డి, చల్లా వెంకటరెడ్డి, చట్టు సైదులు, గోపు రామిరెడ్డి, షేక్ అబ్దుల్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

లగడపాడులో మహిళా దినోత్సవం



మహిళా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులను సత్కరించిన గ్రామస్తులు

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చల్లపల్లి సత్యం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా సమైక్య శక్తులుగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పద్మారావు, లక్ష్మణ, చంద్రం, పుష్పలీల, అన్నమ్మ, సుశీల, మౌలాలి, యలమందస్వామి, మహబూబ్ సుభాని ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

క్రోసూరు: క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో వి.అనూష అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం సాయంత్రం జరిగింది. ఐద్వా పల్నాడు జిల్లా కమిటీ సభ్యురాలు గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పాలకులు ఒక ఉత్సవంలా కాకుండా.. ప్రస్తుత సమాజంలో మహిళల అభ్యున్నతికి పాటు పడే విధంగా చర్చించాలని అన్నారు. ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని మాట్లాడుతూ ప్రైవేటైజేషన్ పేరుతో పాలకులు తీసుకువచ్చిన నూతన ఆర్థిక విధానాల వలన రోజువారి జీవితంలో పెరిగిన ఖర్చుల వలన, మధ్యతరగతి కుటుంబాలు, ముఖ్యంగా మహిళలపై మానసిక ఒత్తిడి పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల కమిటీ సభ్యులు జి.ఎలిశామ్మ, టి.విజయ్ కుమారి, శుక్రా బీ తదితరులు పాల్గొన్నారు.

గీతా గురుకులంలో ఉచిత వైద్యశిబిరం

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గీతా గురుకులం హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకి చెందిన డాక్టర్ కె.ప్రకాశ్‌రావు రోగులకు ఉచితంగా వైద్య పరిక్షలు చేశారు. ఎముకలు, కీళ్ల సమస్యలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 231 మంది వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరం కరస్పాండెంట్ అనిశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరించండి

మాచర్ల : ఉపవాస ప్రార్థనల సందర్భంగా క్రైస్తవులు ప్రభువును ఆరాధిస్తూ, ఆయన బోధనలను ఆచరించాలని పశ్చిమ సినడ్ బిషప్ ఐజయ్య బోధించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో ఉపవాస ప్రార్థన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలు స్తుతించారు. ఉదయం 11 నుంచి 2గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చర్చిలో నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వినుకొండ: పట్టణంలోని అంకాలమ్మ దేవాలయం ఆవరణలో మానవ సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు పి.వి.సురేష్‌బాబు, ప్రధానకార్యదర్శి చామర్తి భవాని శంకర్ మాట్లాడుతూ అన్ని మతాల దేవాలయాల దగ్గర మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మానవ సేవా సమితి ట్రెజరర్ వెంకట్రావు, సభ్యులు కరీముల్లా, లెక్చరర్ తిరుమల, జాబీర్, నాగార్జున, హరీష్, చంద్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన చెరువు

- పట్టించుకోని మైనర్ ఇరిగేషన్ అధికారులు
- నీళ్లు లేకపోవటంతో పశువుల మేత సాగుకు అవస్థలు
- భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీళ్లు కూడా రావంటున్న గ్రామస్తులు



క్రోసూరు చెరువు ప్రస్తుత పరిస్థితి

క్రోసూరు: 500 ఎకరాల విస్తీర్ణం గల క్రోసూరు చెరువు అడుగంటింది. చెరువులో నీళ్లు లేకపోవటంతో చెరువు కింద పొలాల్లో పశువుల మేత సాగుకు నీళ్లు లేని పరిస్థితి ఏర్పడి పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నెలలో క్రోసూరు చెరువు నీళ్లు బయటకు వెళ్లబెట్టి చేపలు పట్టటం జరిగింది. అయితే ఆ తరువాత చెరువుకు ఇప్పటి వరకు నీళ్లు పట్టటం జరగలేదు. దీనిపై చెరువుకు నీళ్లు పడుతున్నట్లు అప్పట్లో మైనర్ ఇరిగేషన్ అధికారి చెప్పినప్పటికీ నీళ్ల పట్టకపోవటంతో అనేక మంది రైతులు పశువుల మేత (పిల్లపెసర, గడ్డి) సాగు చేసుకునేందుకు నీళ్లు లేకుండాపోయాయని వాపోతున్నారు. సమస్యను స్థానిక కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం కనబడలేదని చెప్పుకుంటున్నారు. అంతేకాక మార్చి నెలలోనే చెరువులో నీళ్లు లేని పరిస్థితి ఉంటే వచ్చే మండు వేసవి ఏప్రిల్, మే నెలల్లో నామ మాత్రంగా ఉన్న కాస్త నీళ్లు ఇంకి పోయి భూగర్భ జలాలు అడుగంటి బోర్లకు నీళ్లు కూడా అందని పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు.

స్కీము వాటర్‌ను పెట్టిస్తా

చెరువులో నీళ్లు పెట్టించేందుకు చర్యలు తీసుకుంటాను. సాగర్ నీళ్లు వారబందీ నడుస్తుండటంతో చెరువుకు నీళ్లు పెట్టటం కష్టమే. అయితే పక్కనే ఉన్న వేల్పూరు నుంచి స్కీము నీళ్లు పెట్టించేందుకు ప్రయత్నిస్తాను.

– బాలకృష్ణ,
మైనర్ ఇరిగేషన్ ఏఈ, క్రోసూరు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



తహసీల్దార్ ధనలక్ష్మి

పెదకూరపాడు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తహసీల్దార్ ధనలక్ష్మి ఆదివారం తెలిపారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున తాత్కాలికంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిలిపివేసినట్లు తెలిపారు. మళ్లీ సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమస్యలు ఉన్న వారు తహసీల్దార్ కార్యాలయంలో తమ సమస్యలను అర్జీ రూపంలో అందించాలని కోరారు.

సత్తెనపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్‌కు హాజరవుతారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బెల్లంకొండ: మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల సరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని అన్ని శాఖల అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలని కోరారు.

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఆదివారం చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

క్రోసూరు: ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని తహసీల్దార్ వీవీ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని, అదే విధంగా అర్జీలు ఇచ్చే వారు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందజేయవచ్చునని తెలిపారు.

రోడ్డు కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

దాచేపల్లి: రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మళ్లీ రోడ్డెక్కారు. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. రెండు గంటల పాటు రోడ్డుకి అడ్డుగా వాహనాలు, రాళ్లు పెట్టి నిరసన వ్యక్తం చేయడంతో భారీగా వాహనాలు నిలిచాయి. దాచేపల్లి-తంగెడ గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడటంతో ఇటీవల తవ్వారు. రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణం కోసం చర్యలు చేపట్టి నిలిపివేశారు. భారీ వాహనాల రాకపోకలతో దుమ్మూధూళితో ప్రజలు అల్లాడిపోతున్నారు. నాలుగు రోజుల క్రితం కూడా గ్రామస్తులు రోడ్డెక్కి ఆందోళన చేయగా పోలీసులు సర్ది చెప్పారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ సమస్యను స్థానిక శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళనకారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుమ్మూధూళి లేవకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్ల చల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళన కారణంగా వాహనాలు భారీగా నిలిచిపోయాయి.